ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



అచ్యుతాపురం సెజ్ ఘటనలో కాకినాడ యువతి మృతి



సర్పవరం జంక్షన్, ఆగస్టు 21: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బుధవారం జరిగిన ప్రమాదంలో కాకినాడ యువతి మృతిచెందింది. కాకినాడ 2వ డివిజన్ సౌజన్యనగర్‌కు చెందిన చల్లపల్లి హారిక (22) ఫ్యాక్టరీలో కెమిస్ట్‌గా పనిచేస్తోంది. రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం కాకినాడ వచ్చి పెదనాన్న కుమారులకు రాఖీ కట్టి ఆనందంగా గడిపింది. బుధవారం తెల్లవారుజామున కాకినాడ నుంచి బయలుదేరి అచ్యుతాపురం వెళ్లింది. విధి నిర్వహణలో ఉండగా రియాక్టర్ పేలిన దుర్ఘటనలో హారిక మృతిచెందిందన్న వార్త విన్న తల్లి అన్నపూర్ణ, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



పంచాయతీలకు డబ్బు!

- కాకినాడ జిల్లాకు రూ.27.02 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల
- బకాయిల సర్దుబాట్లకు ఆస్కారం లేకుండా వినియోగానికి పూర్తి అవకాశం
- గ్రామ సర్పంచుల్లో నూతనోత్సాహం

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 21: గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన పంచాయతీలకు మంచి రోజులొచ్చాయి. గత ప్రభుత్వంలో మాదిరి నిధుల్లో నుంచి విద్యుత్ చార్జీల బకాయిల పేరుతో కోతలు, ఇతర అవసరాలకు మళ్లింపు వంటి వాటికి ఆస్కారం లేకుండా కూటమి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. దీంతో గ్రామ సర్పంచుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం రెండో విడత బేసిక్ నిధులు రూ.10,80,83,933, అలాగే 2023-24 టైడ్ నిధులు రెండో విడత రూ.16,21,26,097 నిధులను విడుదల చేస్తున్నట్టు పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఒకేసారి భారీగా నిధుల విడుదలతో బ్లీచింగ్‌కు కూడా డబ్బుల్లేక కొన్నాళ్లుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పంచాయతీలకు ఊరట కలిగించింది. తీవ్ర నిరాశ నిస్పృహలతో ఉన్న సర్పంచ్‌ల్లోనూ ఉత్సాహాన్ని నింపాయి. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో పంచాయతీలను తీవ్రంగా నిర్లక్ష్యం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టాంపు డ్యూటీ, తలసరి ఆదాయం, సినరేజ్ చార్జీలు సరిగా విడుదల చేయకపోగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా మళ్లించేసింది. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. రహదారుల నుంచి తాగునీటి వరకు ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. కాలువపై పాడైన సిమెంట్ పలక కూడా సర్పంచ్‌లు మార్చుకోలేకపోయారు. కేంద్ర నిధులు మళ్లించడంపై సర్పంచ్‌లు రోడ్డెక్కి ఆందోళనలు చేసిన ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులకు ఫిర్యాదు చేసిన జగన్ సర్కార్ పట్టించుకోలేదు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ నిధులు ఉపయోగపడతాయన్న ఆశాభావాన్ని సర్పంచ్‌లు వ్యక్తంచేశారు.

పోతున్నాయ్.. ప్రాణాలు!



ప్రాణాలు పోతున్నాయి.. పోయేవి కార్మికులవే కదా.. ఫ్యాక్టరీల యాజమాన్యాలవి ఎక్కడైనా ఉన్నాయా?? అందుకే నిర్లక్ష్యం.. బతుకు పోరాటంలో భద్రతలేక ఇప్పటి వరకూ ఉమ్మడి జిల్లాలో వందలాది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.. పరిశ్రమల్లో ఎక్కడైనా ప్రమాదం జరిగితే అధికారులు అప్రమత్తమైపోతారు.. పాలకులు పరుగులు పెడతారు.. ఒకట్రెండు రోజులు హడావుడి చేస్తారు.. ఆ తరువాత షరా మామూలే.. కంపెనీల దారి కంపెనీలదే.. అధికారుల దారి అధికారులదే.. కంపెనీలు ఇచ్చే ఆమ్యామ్యాలకు కార్మికుల భద్రతను తాకట్టు పెట్టేస్తున్నారు.. ప్రత్యేకంగా జిల్లాకో పరిశ్రమల శాఖ అంటూ ఉన్నా ఏనాడు తనిఖీలు చేసిన దాఖలాలే కానరావు.. ఈజ్ ఆఫ్ డూయింగ్ మాటున తనిఖీలకు సంకెళ్లు వేయడంతో యాజమాన్యాల ఇష్టారాజ్యంగా మారింది. దీంతో కార్మికులకు భద్రతే కరువైంది.. కూటమి ప్రభుత్వ దీనిపై దృష్టి పెట్టాలి.. జిల్లాకు చెందిన కార్మిక శాఖ మంత్రి సుభాష్ ఈజ్ ఆఫ్ డూయింగ్ సంకెళ్లను తెంచి భద్రతపై భరోసా ఇవ్వాలి..

పరిశ్రమల్లో కార్మికులకు అభద్రత

- అచ్యుతాపురం సెజ్ ఘటనతో ఉలికిపాటు
- 18 మంది కార్మికుల దుర్మరణం
- ఉమ్మడి జిల్లాలో చమురు, గ్యాస్ కంపెనీలు
- ఆయా పరిశ్రమల్లో భద్రతపై భయాందోళనలు
- తూతూ మంత్రంగా భద్రత ప్రమాణాలు
- కాకినాడ చుట్టూ పేలుడు ముప్పున్న కంపెనీలు
- ప్రమాదాలు జరిగితే ప్రాణాలు గాలిలోనే
- గత ప్రభుత్వంలో భద్రతా లోపాలపై నివేదికలు
- పలు కంపెనీల్లో నిబంధనల ఉల్లంఘనలు
- ఏ మాత్రం పట్టించుకోని గత పాలకులు
- కొత్త సర్కారు తనిఖీలు చేపట్టాలని డిమాండ్లు
- ఇకనైనా మేలుకోకుంటే ముప్పే

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో బుధవారం చోటుచేసుకున్న ఘోర పారిశ్రామిక ప్రమాదంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కంపెనీలో రియాక్టర్ పేలిన ఘటనలో ఏకంగా 18 మందికి పైనే కార్మికులు దుర్మరణం పాలవడం పారిశ్రామికవర్గాలను కలవరపాటుకు గురిచేస్తోంది. తాజా ఘటనతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక పరిశ్రమల్లో భద్రత ప్రమాణాల్లో డొల్లతనం మరోసారి చర్చనీయాంశంగా మారింది. అరకొర భద్రత మధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికుల ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పును ఈ దుర్ఘటన మళ్లీ ప్రశ్నిస్తోంది.

జిల్లాలో ఎన్నో పరిశ్రమలు..

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలు అనేక రకాల పరిశ్రమలకు పెట్టింది పేరు. ముఖ్యంగా కాకినాడ జిల్లా కేంద్రాన్ని ఆనుకుని నగరం చుట్టు పక్కల వందలాది చమురు,రసాయన కంపెనీలున్నాయి. ఇవన్నీ కాకినాడ పోర్టు ద్వారా విదేశాల నుంచి రకరకాల రసాయనాలను దిగుమతి చేసుకుంటాయి.ముఖ్యంగా చమురు పరిశ్రమలైతే విదేశాల నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుని బాయిలర్లలో ద్వారా శుద్ధిచేసి అనేక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తాయి. ప్రధానంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పారిశ్రామికవాడల్లో పతంజలి, లోహియా ఎడిబుల్ ఆయిల్, కేపీఆర్ ఆగ్రో, శ్రీసాయి ఆయిల్ ఫీల్డ్, శ్రీకాకినాడ ఆక్సిజన్ గ్యాసెస్ ప్రైవేట్ లిమిటెడ్, పట్టాభి ఆగ్రో, ఆపెక్స్ ఫ్రోజెన్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐవోసీ, ఐవోసీఎల్, సంహిత స్టోరేజ్,భారత్ ఎంటర్‌ప్రైజెస్, అదాని ఆగ్రో ఆయిల్, ఎన్ఎఫ్‌సీఎల్, కోరమండల్ వంటి పరిశ్రమలు పనిచేస్తున్నాయి. సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాల్లోను సిరామిక్, ఆగ్రో, ఆక్వా, టైల్స్ తయారీ వంటి పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో వేలాదిమంది కార్మికులు, ఉద్యోగులు నిరంతరం పనిచేస్తుంటారు. వీరిలో జిల్లాతోపాటు బిహార్, యూపీ, ఒడిషా తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు అధికంగా పనిచేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో రసాయన, ఆగ్రో, కోనసీమలో గ్యాస్ ఆధారిత పరిశ్రమలు, పైపులైన్లు అధికంగా ఉన్నాయి. ఈ పరిశ్రమలు, పైపులైన్లకు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలకు దిక్కులేకుండా పోతోంది. తాజాగా బుధవారం పక్కనే ఉన్న అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాద ఘటనతో ఉమ్మడి జిల్లాలో గతంలో జరిగిన పారిశ్రామిక ప్రమాదాలు కలవరపెడుతున్నాయి. కోనసీమ జిల్లాలోని అనేక మండలాల్లో అప్పుడప్పుడు గ్యాస్ పైపులైన్లు లీకై ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నాయి. రామచంద్రపురం, మండపేట, అనపర్తి నియోజకవర్గాల్లోని ఆయిల్,ఆగ్రో పరిశ్రమల్లోను తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో అనధికారికంగా తయారుచేసే మందుగుండు పరిశ్రమల్లో ఏటా ఇరవై మందికిపైగా చనిపోతున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో పలు పరిశ్రమల్లో ఎక్కడో ఒక చోట ఏదొక ప్రమాదం జరుగుతూనే ఉంది.ముఖ్యంగా వాకలపూడిలో ఉన్న ఆయిల్ పరిశ్రమలో భద్రత ప్రమాణాలు పాటించడం లేదని ఏడాదిన్నర కిందట అధికారులు తేల్చారు. ఇందులో గనుక ప్రమాదం జరిగితే నగరంలో అర కిలోమీటరు మేర దాని ప్రభావం ఉంటుందని గుర్తించారు. అయినా గత వైసీపీ సర్కారు ప్రమాదాలు పొంచి ఉన్న పరిశ్రమల విషయంలో పెద్దగా చర్యలు తీసుకున్న పాపానపోలేదు. ఆయా కంపెనీల నుంచి మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు పరిహారం ఇప్పించామని గొప్పలు చెప్పడం, ఆ ముసుగులో కంపెనీలను బెదిరించి తామూ కొంత దండుకోవడం మినహా కార్మికుల భద్రతకు గట్టిగా వ్యవహరించలేదు.

నాడు లోపాలు గుర్తించినా..

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బుధవారం జరిగిన ప్రమాదం తరహా ఘటనలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గడిచిన కొన్నేళ్లలో అనేకం చోటుచేసుకున్నాయి. ప్రధానంగా 2021లో కాకినాడలో సర్పవరం టైకీ రసాయన పరిశ్రమలో బాయిలర్ పేలిన ఘటనలో ఇద్దరు సజీవ దహనమయ్యారు. ఆ తర్వాత 2022లో ప్యారీ షుగర్స్ ఫ్యాక్టరీలో జరిగిన వరుస ప్రమాదాల్లో ఐదుగురి దేహాలు నుజ్జునుజ్జయ్యాయి. గతేడాది మార్చిలో పెద్దాపురం అంబటి ఆయిల్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఏకంగా ఏడుగురు కార్మి కులు దుర్మరణం చెందారు.అలాగే 2014 జూన్‌లో కోనసీమలోని నగరంలో గెయిల్ గ్యాస్‌పైపులైన్ పేలుడులో 15 మంది దుర్మరణం పాలయ్యారు. ఇలా అనేక ప్రమాదాల్లో ఎందరో చనిపోయారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలోని ఎల్జీపాలిమర్స్ గ్యాస్ లీకు దుర్ఘటన జరగడంతో 2020 మేలో ప్రభుత్వం అన్ని జిల్లాల్లో పరిశ్రమల్లో భద్రత ప్రమాణాల డొల్లతనంపై తనిఖీలకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోను అప్పటి జేసీల నేతృత్వంలో ఫ్యాక్టరీలు, పరిశ్రమలు, ఫైర్, కాలుష్య నియంత్రణ బోర్డు తదితర శాఖలతో కూడిన అధికారుల బృందం జిల్లాలోని పరిశ్రమల్లో భద్రత లోపాలు, ప్రమాదాలు జరిగితే ప్రాణ నష్టం నివారించే వ్యవస్థలు ఉన్నాయో లేవో తనిఖీలు చేసింది. ఇరవై అంశాల్లో తనిఖీలు చేసి నివేదికలు తయారు చేశారు. ఇందులో పలు పరిశ్రమలు ప్రమాదాల నివారణకు కనీస చర్యలు తీసుకోవడం లేదని గుర్తించారు. కోనసీమలో అనేక గ్యాస్ పైపులైన్ల ద్వారా పొంచి ఉన్న ముప్పును గుర్తించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సర్కారుకు సిఫార్సులు చేశారు. కానీ అప్పటి ప్రభుత్వం ఆ తర్వాత నివేదికలను గాలికొదిలేసింది. గతేడాది పెద్దాపురం అంబటి ఆయిల్ ఫ్యాక్టరీ దుర్ఘటన తర్వాత ఉమ్మడి జిల్లాలో అనుమతులు లేని, భద్రత చర్యలు పాటించని కంపెనీల పైనా తనిఖీలు చేపట్టారు. ఇందులో కొన్ని అత్యంత ప్రమా దకర కంపెనీలను గుర్తించారు. వీటిలో కార్మికుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదని నిగ్గుతేల్చారు. కానీ ఆ కంపెనీలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దాంతో పరిస్థితి మొదటికొచ్చింది.

కొత్త ప్రభుత్వం మేల్కొనాలి..

అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన దుర్ఘటనను దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రభుత్వం పరిశ్రమల్లో భద్రత వ్యవహారాలను మరింత పెంచేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. జిల్లాలో అత్యంత ప్రమాదకర పరిశ్రమల్లో పొంచి ఉన్న ప్రమాదాలు, తీసుకోవాల్సిన భద్రత చర్యలు, పేలుళ్ల నివారించడానికి ఆయా కంపెనీల సన్నద్ధత ఏ విధంగా ఉందో పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ఫ్యాక్టరీలు, పరిశ్రమల్లో ప్రమాద నివారణ వ్యవస్థలు, మాక్‌డ్రిల్స్ జరుగుతున్నాయా? లేదా? రియాక్టర్లు, బాయిలర్స్ పేలుడు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై మరింత అప్రమత్తత ఏ స్థాయిలో ఉందో సమీక్షించాల్సిన అవసరం ఏర్పడింది.



అనపర్తి శ్రీచక్ర ఆయిల్స్‌లో ప్రమాదం (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో కొన్ని ప్రమాదాలు

- అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన తరహా ప్రమాదం 2021లో కాకినాడ నగరం సర్పవరం టైకీ రసాయన పరిశ్రమలో జరిగింది. బాయిలర్ పేలిన ఘటనలో ఇద్దరు సజీవ దహనం కాగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.
- 2022 ఆగస్టు 19న కాకినాడను ఆనుకుని ఉన్న ప్యారీ షుగర్ ఫ్యాక్టరీలో విస్ఫోటనం చోటుచేసుకుంది. లోపల బాయిలర్ పేలడంతో ముగ్గురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు.తిరిగి ఆగస్టు 29న ఇదే ఫ్యాక్టరీలో రెండోసారి మూడో అంతస్తులో యంత్రం నుంచి ఓ పైప్ కింద పడిపోవడంతో ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు.
- గతేడాది అంటే 2023 ఫిబ్రవరి9న పెద్దాపురం అంబటి ఆయిల్ పరిశ్రమలోఇరవై అడుగులకుపైగా ఎత్తున్న పొడవాటి ఆయిల్ ట్యాంకులోకి శుభ్రం చేయడానికి దిగి మడ్డిలో ఇరుక్కుని దుర్మరణం పాలయ్యారు.
- 2014లో కోనసీమలోని నగరంలో గెయిల్ పైపులైన్ పేలుడు ఘటనలో 15మంది దుర్మరణం పాలయ్యారు.
- 2019లో తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పీరారామచంద్రపురంలో శ్రీచక్ర ఆయిల్స్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో రూ.25 కోట్లు నష్టం వాటిల్లింది. ప్రాణనష్టం సంభవించలేదు.
- 2022లో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నం శివారు కొండగూడెంలో ఉన్న విజన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు.

పాశర్లపూడిలంక వాసి మృతి



మామిడికుదురు, ఆగస్టు 21: అనకాపల్లిలో ఫార్మా కంపెనీలో బుధవారం మధ్యాహ్నం జరిగిన పేలుడు ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడిలంక గ్రామానికి చెందిన మారిశెట్టి సతీష్ (31) మృతిచెందినట్టు సమాచారం. నాలుగేళ్లగా సతీష్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడికి మూడేళ్ల క్రితం సాయిశ్రీ వినాయక దుర్గా వెంకట నాగమణితో వివాహమైంది. సతీష్ తండ్రి శ్రీను కొబ్బరి పీచుతో మ్యాట్‌లు తయారుచేసి విక్రయిస్తుంటాడు. తల్లి పద్మావతి గృహిణి. సమాచారం తెలియడంతో తల్లిదండ్రులు, భార్య ఇక మాకు దిక్కెవరంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

గ్రామ సభలపై కలెక్టర్ కాన్ఫరెన్స్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 21: రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం అమలు, ఈనెల 23 నుంచి జరిగే గ్రామ సభలపై బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడ కలెక్టర్ బంగ్లా నుంచి జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రంలో ఉచిత ఇసుక నిర్వహించే గ్రామసభలు, వాటి నిర్వహణ తీరుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లకు పలు సూచనలను జారీచేశారు.

గ్రామసభలను పంచాయతీల్లో విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 21: ఈనెల 23న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్న గ్రామసభలను జిల్లాలోని అన్ని గ్రామ పంచాయితీల్లో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. ఈనెల 23న రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న గ్రామసభల సంసిద్ధతపై బుధవారం కాకినాడ కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల్లో ఆయా మండల ప్రత్యేకాధికారులు గ్రామ సదస్సులో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతి గ్రామంలో ప్రజాస్వామ్య పద్ధతిలో గ్రామ సభలు నిర్వహించి, గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. వాటిని గ్రామస్తుల సమక్షంలోనే ఆమోదించడం జరుగుతుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనుల గుర్తింపు ప్రణాళిక ప్రక్రియను రూపొందించుకునేందుకు గ్రామ సర్పంచ్ అధ్యక్షతన ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభలను నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. గ్రామ సభలు పూర్తయిన వెంటనే ప్రభుత్వం రూపొందించిన ఈఎంఎంఎస్ యాప్‌ద్వారా ఫోటోలు, వీడియోలు, సంబంధిత మినిట్స్ నోట్ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించుకునే ఉద్దేశంతో ప్రతీ కుటుంబానికి 100రోజుల ఉపాధి హామీ పనిని కల్పించడంపై గ్రామ సభలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీవో భారతిసౌజన్య, జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి డ్వామా పీడీ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ భానుగుడి జంక్షన్‌లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దృశ్యం



తుని మండలం తేటగుంట వద్ద జాతీయ రహదారిపై ఆందోళన చేపడుతున్న ఎస్సీ నాయకులు

బంద్ ప్రశాంతం

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ జిల్లావ్యాప్తంగా ఆందోళనలు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు21: మాలమహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన భారత్‌బంద్ బుధవారం కాకినాడ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ జిల్లావ్యాప్తంగా మాలమహానాడు జేఏసీ సభ్యులు ఆందోళనకు దిగారు. జిల్లా కేంద్రం కాకినాడలో ఉదయాన్నే బస్టాండ్‌కు వచ్చి బస్సులను నిలిపివేశారు. రాజమహేంద్రవరం, అమలాపురంతోపాటు విశాఖ, విజయవాడ వైపు వెళ్లాల్సిన బస్సులను అడ్డుకున్నారు. కాకినాడ ఆర్టీసీ డిపోలో 148 బస్సులకుగాను 93 బస్సులు, తుని డిపోలోనే 73 బస్సులకు 23 బస్సులు, ఏలేశ్వరం డిపోలో 46 బస్సులకు 30 బస్సులు మాత్రమే రోడ్డు ఎక్కాయి. మొత్తం జిల్లాలో 267 బస్సులకుగాను 151 బస్సులు మాత్రమే తిరిగాయి. దీంతో రూ.21.60 లక్షలు నష్టం వాటిల్లినట్టు ప్రజారవాణాధికారి శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ, ఏలేశ్వరం, తుని డిపోల పరిధిలో డిపోల వద్ద ధర్నా చేయడంతో డిపో నుంచి బస్సులు బయటకు వెళ్లేందుకు వీల్లేకపోవడంతో డిపోలకే పరిమితమైనట్లు శ్రీనివాస్ తెలిపారు. ముందుగానే భారత్ బంద్ ప్రకటించడంతో ముందు రోజే ప్రభుత్వ ప్రైవేట్, పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. అలాగే హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్‌తో పాటు నగరంలోని దుకాణాలను మూసివేశారు. అలాగే జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా, బీఎస్పీ పార్టీల ప్రతినిధులు ప్రభుత్వ కార్యాలయాలను మూసివేయించారు. స్కూళ్లు, కాలేజీలను దగ్గరుండి మూసివేయించారు. వర్గీకరణ వద్దు..ఐక్యత ముద్దు అంటూ ప్లకార్డులతో నినదించారు. అలాగే సామర్లకోట రైల్వే స్టేషన్ వద్ద బంద్ నేపథ్యంలో ఉద్రిక్తత నెలకొంది. స్టేషన్లోకి దళిత సంఘాల నేతలు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకోగా, దీంతో ఇరు వర్గాల మధ్య కాసేపు ఉద్రిక్తత నెలకొంది. మిగిలిచోట్ల ప్రశాంతంగా జరిగింది.





పిచ్చికుక్క విచక్షణారహితంగా కరవడంతో అయిన గాయాలు

భోగాపురం, ఏడు కాలువల్లో పిచ్చికుక్కల స్వైరవిహారం

రెండు ప్రాంతాల్లో మొత్తం 16 మందికి కాట్లు

పిఠాపురం, ఆగస్టు 21: పిఠాపురం పట్టణ శివారు ఏడు కాలువలు, మండలంలోని భోగాపురం గ్రామంలో బుధవారం పిచ్చికుక్కలు స్వైరవిహారం చేయడంతో 16 మందికి గాయాలయ్యాయి. భోగాపురంలో ఓ పిచ్చికుక్క రహదారులపై నడుస్తున్న వారిపై దాడి చేసి విచక్షణారహితంగా కరిచింది. గ్రామానికి చెందిన కాకడ నాగేశ్వరరావు చేయి, కాలిపై పలుచోట్ల కరవడంతో లోతుగా గాయాలయ్యాయి. ఇతనితో సహా పది మంది కుక్కకాటుకు గురయ్యారు. అలాగే ఏడుకాలువల ప్రాంతంలో పిచ్చికుక్క కరవడంతో ఆరుగురు గాయపడ్డారు. పిచ్చికుక్క కాటుకు గురైనవారు పిఠాపురం, కాకినాడ ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నారు.

ఎండ..వర్షం..ఉక్కపోత

విభిన్న వాతావరణంతో ప్రజలు విలవిల

పిఠాపురం/గొల్లప్రోలు, ఆగస్టు 21: ఎండ, వర్షం, ఉక్కపోత, మళ్లీ వర్షం.. ఆపై ఎండ.. బుధవారం ఇలా రోజంతా విభిన్న వాతావరణంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. రెండుసార్లు వర్షం కురిసినా వాతావరణం చల్లబడకపోగా ఉక్కపోత, వేడి వాతావరణంతో విలవిలలాడారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో విభిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. బుధవారం ఉదయమే చిరుజల్లులు పడ్డాయి. ఆపై ఎండ తీవ్రత పెరిగింది. ఎండ కాస్తుండగానే మబ్బులు ఆకాశంలో అలుముకున్నాయి. మధ్యాహ్నం వరకూ ఇదే పరిస్థితి కొనసాగి వర్షం కురిసింది. వాతావరణం చల్లబడుతుంది అనుకునే సమయానికి మళ్లీ ఎండ తీవ్రంగా కాసింది. దీంతో తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు సతమతమయ్యారు. రాత్రి వరకూ ఇదే పరిస్థితి. ఉదయం మబ్బులు రావడం, చిరుజల్లులు పడి మళ్లీ ఎండ, ఉక్క వాతావరణం ఏర్పడి చిన్నారులు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరయ్యారు.



పిఠాపురంలో బుధవారం మధ్యాహ్నం వర్షం కురుస్తున్న దృశ్యం

రేపు ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్తపేట మండలం వానపల్లి రాక

ఉద్యోగోన్నతులు రద్దు

▸ 17 మందికి గ్రేడ్-1 వీఆర్వోలుగా రివర్షన్

▸ ఉత్తర్వులు జారీ చేసిన కాకినాడ జిల్లా కలెక్టర్

చింతూరు, ఆగస్టు 21: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో రెవెన్యూ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ సహాయకులకు గ్రేడ్-1 వీఆర్వోలుగా రివర్షన్ ఇస్తూ కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు రెండేళ్ల క్రితం జీవో నెం.154 ప్రకారం 17 మంది గ్రేడ్-1 వీఆర్వోలు సీనియర్ సహాయకులుగా ఉద్యోగోన్నతి పొందారు. 17 మందిలో చింతూరు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్లలో 14 మంది, మిగిలిన ముగ్గురు మండపేట, తుని, అయినవిల్లిల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. నిబంధనల మేరకు వారంతా నిర్దేశించిన కాల పరిమితిలో డిపార్ట్మెంటల్ పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. కాల పరిమితి పూర్తి అయినప్పటికీ వారంతా ఆ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదు. దీంతో వారందరినీ గ్రేడ్-1 వీఆర్వోలుగా (రివర్షన్) కాకినాడ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నకిలీ ఫోన్ పేతో బురిడీ

▸ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 21: కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలో పద్మరాజు కిరాణా, ఫ్యాన్సీ హోల్‌సేల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఓ వ్యక్తి వచ్చి రెండు కింగ్ సిగరెట్ పెట్టెలు, ఒక ఫ్రీడం ఆయిల్ సీసా కావాలని కోరాడు. ఒక్కో సిగరెట్ బాక్స్ రూ.3,400 చొప్పున రెండింటికీ రూ.6,800, ఫ్రీడం ఆయిల్‌కి రూ.1,800 మొత్తం రూ.8,600 బిల్లు అయ్యింది చెల్లించాలని కోరాడు. ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లిస్తానని చెప్పగా స్కానర్ ద్వారా నగదు చెల్లించాలని వ్యాపారి పద్మరాజు కోరాడు. స్కానర్ పని చేయట్లేదని, మొబైల్ నెంబరు చెప్పాలని కోరడంతో ఆ విధంగానే చేశాడు. ఫోన్ పే నెంబరుకు రూ.8,600 పంపినట్టు నకిలీ లావాదేవీ చూపించాడు. డబ్బులు ఇంకా అకౌంట్‌లోకి రాలేదని చెప్తున్న క్రమంలో బైక్‌పై సరుకుతో సహా అక్కడి నుంచి పరారయ్యాడు. నకిలీ ఫోన్ పే లావాదేవీ చూపి తనను మోసం చేశాడన్న విషయాన్ని గుర్తించిన వ్యాపారి సీసీ ఫుటేజీ ద్వారా బైక్ నెంబరును గుర్తించి ఆర్టీవో కార్యాలయం ద్వారా వివరాలు సేకరించాడు. కాకినాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఉన్న క్రైం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. కొత్తపల్లి మండలం గంగోలిపేట అమీనాబాద్‌కు చెందిన వడ్డి రాజు పేరుపై ఏపీ 35జేఎం 5966 పేర బైక్ ఉన్నట్టు పద్మరాజు తెలిపాడు. దానికి పోలీసులు విధించిన జరిమానాలు కూడా పెండింగులో ఉన్నాయన్నాడు. నిందితుడిని పట్టుకుని నగదు రికవరీ చేయాలని కోరుతూ సర్పవరం క్రైం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

లింక్ ఓపెన్ చేయగానే

రూ.2.62 లక్షలు హాంఫట్

గండేపల్లి, ఆగస్టు 21: గుర్తు తెలియని నెంబరు నుంచి వచ్చిన లింక్ ఓపెన్ చేయగానే బ్యాంకు ఖాతా నుంచి రూ.2.62 లక్షలు మాయమైన ఘటనపై బుధవారం గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్ళూరుకు చెందిన పుచ్చకాయల వెంకటరమణకు గుర్తు తెలియని మొబైల్ నెంబరు నుంచి లింక్ వచ్చింది. ఆ లింక్‌పై అతడు క్లిక్ చేయగానే రూ.2.62 లక్షలు పోయినట్టు గ్రహించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు కేసు నమోదు చేయగా జగ్గంపేట సీఐ లక్ష్మణరావు దర్యాప్తు చేస్తున్నారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

మరిడమ్మ హుండీల ఆదాయం

రూ.15.83 లక్షలు

పెద్దాపురం, ఆగస్టు 21: కాకినాడ జిల్లా పెద్దాపురంలోని మరిడమ్మ అమ్మవారి ఆలయంలో హుండీలను దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో బుధవారం తెరిచి లెక్కించారు. 29 రోజులకు రూ.15,83,217 సమకూరినట్టు దేవస్థానం సహాయ కమిషనరు చేబ్రోలు రామ్మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, దేవదాయ శాఖ అధికారులు కాట్నం జగన్మోహన శ్రీనివాస్, చల్లా బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.



వెండి మబ్బులు

ఆకాశంలో వెండి మబ్బులు కనువిందు చేశాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద బుధవారం ఉదయం పది గంటలకు కెమెరాకు చిక్కిందీ దృశ్యం. - మండపేట

ఇంటర్నేషనల్ స్టూడెంట్ రిక్రూట్‌మెంట్‌పై అవగాహన

జేఎన్టీయూకే, ఆగస్టు 21: జేఎన్టీయూ సెనేట్ హాల్లో ఫారన్ యూనివర్శిటీ రిలేషన్స్ (ఎఫ్‌యూఆర్) డైరెక్టరేట్ ఆధ్వర్యంలో జేఎన్టీయూకే, యూఎస్‌ఏలోని సౌత్ యూనివర్శిటీ ఇంటర్నేషనల్ స్టూడెంట్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియపై బుధవారం ఎక్సెల్లా గ్రూప్ సహకారంతో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఉన్నత విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు అనేక అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. సౌత్ యూనివర్శిటీ ఇంటర్నేషనల్ మార్కెటింగ్ డైరెక్టర్ జోసెఫ్ క్యాస్ట్రో మాట్లాడుతూ 125 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన అమెరికాలోని సౌత్ యూనివర్శిటీకి రెండు క్యాంపస్‌లున్నాయని తెలిపారు. ఫ్లోరిడాలోని టంపా నగరంలో ఒకటి, జార్జియాలోని సవన్నా నగరంలో మరొకటి ఉండగా బిజినెస్ మేనేజ్‌మెంట్, సీఎస్‌ఈ, అలైడ్ హెల్త్‌సైన్సెస్‌ల్లో విద్యార్థులకు పలు కోర్సులు అందిస్తున్నాయన్నారు. అనంతరం సౌత్ యూనివర్శిటీ అందించే కోర్సుల వివరాలు, ట్యూషన్ ఫీజు, ఉపాధి అవకాశాలు, క్యాంపస్‌లోని సదుపాయాలను వివరించారు. ఎఫ్‌యూఆర్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎ.స్వర్ణకుమారి అధ్యక్షత వహించగా ఎక్సెల్లా ఎడ్యుకేషన్ గ్రూప్ ప్రతినిధి డి.కాంతికిరణ్, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సౌత్ యూనివర్శిటీ డైరెక్టర్ జోసెఫ్ క్యాస్ట్రో

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఖరారు



పల్లాలమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో ఓ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు, కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు

రేపు కొత్తపేట మండలం వానపల్లి రాక

కొత్తపేట, ఆగస్టు 21: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండల పరిధిలోని వానపల్లి గ్రామంలో శుక్రవారం జరిగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొంటారని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. బుధవారం ఆయన కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావులతో కలిసి వానపల్లిలోని పళ్లాలమ్మ అమ్మ వారి ఆలయ ప్రాంగణ సమీపంలోని ప్రదేశాలను పరిశీలించారు. దీనికి సంబంధించి రూట్‌మ్యాప్ ఖరారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారన్నారు. హెలిపాడ్‌కు సంబంధించి కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. పరిశీలనలో టీడీపీ సీనియర్ నాయకులు ఆకుల రామకృష్ణ, ధర్నాల రామకృష్ణ, పల్లి భీమారావు, సలాది నాగేశ్వరరావు, పల్లి ఏసు తదితరులు వున్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న పిఠాపురం రూరల్ పోలీసులు

పిఠాపురం రూరల్, ఆగస్టు 21: తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు పిఠాపురం రూరల్ పోలీసులు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం జల్లూరు గ్రామానికి చెందిన బత్తిన శ్రీరామ్ (13) ఈ నెల 18వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తన కుమారుడు అదృశ్యమయ్యాడని బాలుడి తండ్రి శివన్నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శ్రీరామ్ జల్లూరు నుంచి సామర్లకోట సైకిల్‌పై వెళ్లి రైల్వే స్టేషన్లో పెట్టి అక్కడి నుంచి రైలు ఎక్కినట్టు గుర్తించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించి బుకింగ్ కౌంటర్‌లో విచారణ జరిపి బాలుడు విశాఖ వెళ్లినట్టు గుర్తించి వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా సమాచారం ఇచ్చారు. బాలుడు విశాఖపట్టణంలో ఉన్నట్లు గుర్తించి బుధవారం పిఠాపురం రూరల్ పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. శ్రీరామ్ ప్రైవేటు స్కూలులో 8వ తరగతి చదువుతున్నాడు. తనను చదవమని ఒత్తిడి చేస్తున్నారని, తమ్ముడిని బాగా చూస్తున్నారని, అందుకే ఇంటి నుంచి వెళ్లిపోయానని శ్రీరామ్ చెప్తున్నాడు. అతడిని బుధవారం రాత్రి ఎస్ఐ గుణశేఖర్ తల్లిదండ్రులకు అప్పగించారు.



నిందితుడిని మీడియాకు చూపిస్తున్న కోరుకొండ సీఐ నాగ మురళి

బంగారం షాపులో చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

42.5 గ్రాముల బంగారం, 450 గ్రాముల వెండి రికవరీ

కోరుకొండ, ఆగస్టు 21: తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ లోని ఒక బంగారం షాపులో మార్చిలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను కోరుకొండ మండలం కాపవరం శివారులో బుధవారం అరెస్టు చేశారు. దీనికి సంబం ధించి కోరుకొండ సీఐ అడపా నాగమురళి తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... మార్చి ఒకటో తేదీ అర్ధరాత్రి సమయంలో కోరుకొండ మసీదు పక్కన గల శ్రీలక్ష్మీ అయ్యప్ప బ్యాంకర్స్, బంగారం షాపులో జరిగిన దొంగతనంపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా బుధవారం ఉదయం 5.30 గంటల సమయంలో కాపవరం శివారులో ఉలిదిండి కిరణ్, బొమ్మోతి సుధీర్‌కుమార్‌లను అరెస్టు చేశారు. కిరణ్‌ది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం నేదునూరు సుధీర్‌ది కోరుకొండ మండలం పశ్చిమగోనగూడెం. వారిద్దరి నుంచి 42.5 గ్రాముల బంగారు వస్తువులు, 450 గ్రాముల వెండి వస్తువులు రికవరీ చేశారు. మరికొన్ని బంగారం వస్తువులను వరంగల్ సమీపంలోని హన్మకొండ, రాజుపేటల్లో ముత్తూట్ ఫైనాన్స్, కెనరా బ్యాంకుల్లో తాకట్టు పెట్టారు. వాటిని రికవరీ చేయాల్సి ఉంది. నిందితులిద్దరూ పాత నేరస్తులు. వారిని అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన కోరుకొండ సీఐ, ఎస్ఐ, సిబ్బందిని తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ అభినందించారు. వారికి రివార్డు ఇస్తారని సీఐ నాగమురళి చెప్పారు..



సంఘటనా స్థలం నుంచి ఫోన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

మోటారు సైకిలును ఢీకొన్న లారీ

▸ ఒకరికి తీవ్ర, ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలు

▸ ఆ మార్గంలో వెళ్తుండగా చూసి స్పందించిన కలెక్టర్

▸ తక్షణం వైద్య సహాయం అందించాలని సూచన



ప్రమాదానికి కారణమైన లారీ

రాజానగరం, ఆగస్టు 21: పరామర్శకు వెళ్తూ మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని చూసి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చలించిపోయారు. వెంటనే వాహనం ఆపి 108 అంబులెన్సుకు ఫోను చేశారు. తక్షణ వైద్య సహాయం అందించేలా చర్యలు చేపట్టాలని సమీపంలోని జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులకు ఫోనులో సూచించారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో ఉన్న కలెక్టర్ ప్రశాంతి రాజానగరం హైస్కూలు సమీపంలో ప్రమాదంలో గాయపడి వైద్య సహాయం కోసం ఎదురుచూస్తున్న వారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెద్దాపురం మండలం ఆనూరు-కొత్తూరు గ్రామానికి చెందిన సీహెచ్ దుర్గాప్రసాద్, జి.వీరవెంకటలక్ష్మి, సీహెచ్ మసిరమ్మ మోటారు సైకిలుపై కోరుకొండ మండలం గాదరాడలోని తమ బంధువుల ఇంటికి పరామర్శకు బయల్దేరారు. ఏడీబీ రోడ్డులో రాజానగరం హైస్కూలు కూడలి వద్ద హైవే దాటుతున్న సమయంలో రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ మోటారు సైకిలును ఢీకొంది. హైవేపై ప్రయాణం చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్ నియమాలు పాటించాలని వాహనచోదకులకు కలెక్టర్ ప్రశాంతి సూచించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై జీఎస్ఎల్ వైద్యులను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.... దుర్గాప్రసాద్ తలకు బలమైన గాయాలయ్యాయని, మిగిలిన ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలు అయ్యాయని చెప్పారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

కరప, ఆగస్టు 21: కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లిలో అమ్మవారి గుడి వీధికి చెందిన మరుకుర్తి సత్తిబాబు (40) స్థానిక ఆక్వా చెరువుల వద్ద పని చేస్తున్నాడు. కాగా బుధవారం మధ్యాహ్నం చెరువుల వద్ద కాపలా కాస్తుండగా విష సర్పం కరిచింది. దీంతో అపస్మారక స్థితికి చేరుకుని అక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుని న్యాయం చేయాలని కోరుతూ బంధువులు మృతదేహంతో ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్తత తలెత్తింది. ఎస్ఐ టి.రామకృష్ణ ఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

కరప, ఆగస్టు 21: కాకినాడ జిల్లా కరప మండలం పెదకొత్తూరు గ్రామానికి చెందిన దాసరి భీమరాజు (28) బుల్డోజర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 19న పనిమీద ఉప్పాడ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో వాకాడ వంతెన వద్దకు వచ్చేసరికి బండి స్కిడ్ అయ్యి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన భీమరాజును కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు

మండపేటలో నేడు, రేపు

అంతర్జాతీయ సెమినార్

▸ దేశ, విదేశాల నుంచి శాస్త్రవేత్తల రాక

మండపేట, ఆగస్టు 21: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురు, శుక్రవారాల్లో అంతర్జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలి రోజు సెమినార్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభిస్తారన్నారు. కళాశాల చరిత్రలోనే తొలిసారిగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సెమినార్‌కు కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనరు పోలా భాస్కర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ కృష్ణ, ఆర్జేడీ డాక్టర్ శోభారాణి, కొరియా దేశానికి చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ కె.నవీన్ కుమార్, డాక్టర్ అక్కినేపల్లి భార్గవ్, డాక్టర్ బత్తుల బాబు, డాక్టర్ చావా రామకృష్ణ, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ గురుప్రకాష్ నున్న, డాక్టర్ సీతారామరాజు, యునుగనమ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలతో పాటు డాక్టర్ వర్మకవి నరేష్, యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్, దేశంలోని ప్రసిద్ధ యూనివర్సిటీలకు చెందిన ఫిజిక్స్ విభాగ అధ్యాపకులు హాజరవుతున్నారని ఆయన చెప్పారు. తొలిసారిగా గ్రామీణ వాతావరణంలో విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు ఈ సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేక్ గ్రేడ్ అటానమస్ కోసం కూడా ప్రయత్నిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సెమినార్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు ఆయన పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ కె.శ్రీనివాసరావు, ఎ.ఆనందరావు, ఎన్ఎస్‌వీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రుద్రరాజు

సెమీ సంస్థలతో అదానీకి లబ్ధి

▸ సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు ఆరోపణ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21: సెమీ సంస్థల ద్వారా అదానీ సంస్థలకు లబ్ధి చేకూర్చి పెడుతున్నారని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు ఆరోపించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం పదేళ్ల పూర్తి చేసుకుని 11వ ఏట అడుగుపెట్టిందన్నారు. ఈ కాలంలో ప్రధాని మోదీ అనేక దేశాల పర్యటనలకు సంబంధించిన ఖర్చులపై అధికారికంగా శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మోదీ విదేశీ పర్యటన వల్ల ఏ లాభం జరిగిందో తెలపాలన్నారు. దేశంలో వనరులను ధారాదత్తం చేశారని, మైన్స్‌ను అంబానీ, అదానీలకు కట్టబెట్టారని ఆరోపించారు. సోలార్‌కు సంబంధించి పెద్ద స్కామ్ జరుగుతోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన అంశాలను అమలు చేయకుండా తాత్సారం చేస్తోందన్నారు. ప్రభుత్వ శాఖల ప్రక్షాళనతో పాటు అభివృద్ధి, సంక్షేమాలపై దృష్టిపెట్టాలన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నగర ఇన్‌చార్జి బోడా వెంకట్, నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, సీనియర్ నాయకులు టీకే విశ్వేశ్వరరెడ్డి, అబ్దుల్లా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

డొంకరాయి జలాశయం నుంచి

1101 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల



మోతుగూడెం, ఆగస్టు 21: డొంకరాయి జలాశయం ద్వారా బుధవారం ఉదయం 1101 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా బుధవారం ఉదయం 1036.50 అడుగులకు చేరుకుంది. ఎగువ ప్రాంతంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. పూర్తిస్థాయికి చేరుకుంటే గేట్లపై ఒత్తిడి పడే ప్రమాదం ఉందన్న నిపుణుల సూచనలతో జెన్‌కో అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈఈ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎగువన కురుస్తున్న వర్షాలకు డొంకరాయి జలాశయానికి 5,048 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందన్నారు. దీంతో 6వ నెంబరు గేటును ఒక అడుగు పైకెత్తి దిగువకు 1101 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి నీటిమట్టం ప్రమాద స్థాయికి పెరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మరో 4వేల క్యూసెక్కుల నీటిని కెనాల్ ద్వారా పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విడుదల చేస్తున్నామన్నారు. ఇన్‌ఫ్లోస్ తగ్గితే దిగువకు నీటి విడుదల నిలిపివేస్తామని ఈఈ చెప్పారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట

ముగిసిన స్కూల్ అసిస్టెంట్ల సర్దుబాటు

తొండంగి,ఆగస్టు 21: మండలంలో స్కూల్‌అసిస్టెంట్ల సర్దుబాటు ప్రక్రియ బుధవారం ముగిసింది. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవోలు షేక్ బాబ్జి, అనిశెట్టి సుబ్బిరెడ్డి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల సమక్షంలో ప్రక్రియ ప్రారంభించారు. మండలంలో వివిధ సబ్జెక్టులకు 26పోస్టులు అవసరంగా గుర్తించారు. 9మంది మాత్రమే స్కూల్ అసిస్టెంట్లు మిగులుగా ఉండడంతో వారితోపాటు మరో పదిమంది ఎస్‌జీటీలను సర్దుబాటు చేశారు. తెలుగు1, బీఎస్1, మరో ఐదుగురు హిందీకి అవసరంగా ఉన్నారు.

ఐడియా.. అదిరింది!



» ఎండా, వానల రక్షా ఛత్రం

కరప, ఆగస్టు 21: ఒక చిన్న ఐడియా ఆ ద్విచక్ర వాహనదారుడి వ్యాపారానికి విఘాతం కలగకుండా చేసింది. అన పర్తి మండలానికి చెందిన ఓ వ్యాపారి నిత్యం ఊరులు తిరుగుతూ ఉంటాడు. భరించలేని ఎండలు, భారీ వర్షాలవల్ల అతడి వ్యాపారానికి తరచూ విఘాతం కలుగుతుండే ది. దీంతో నాలుగు నెలల క్రితం రూ.2,500 ఖర్చు చేసి అతడి బైక్ ముందు పెట్రోల్ ట్యాంక్‌పై గొడుగు ఆకారంలో ఒక ఛత్రాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ ఆలోచనతో ఎం డా, వానలనుంచి రక్షణ పొందుతున్నాడు. అతడి వ్యాపార మూ నిర్విఘ్నంగా కొనసాగుతోంది. కరప మండలం ఉప్పలంకలో బుధవారం ఆ బైక్ వెళ్తుండగా ఆ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమేరాలో ఇలా బంధించింది.

వేట పరిహారం చెల్లించరూ?

» నిషేధ కాలంలో పరిహారం అందక గగ్గోలు పెడుతున్న మత్స్యకారులు

» త్వరగా పరిహారం చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి



ఉప్పాడ తీరంలో లంగరు వేసి భద్రపరుచుకున్న మత్స్యకారుల బోట్లు

కొత్తపల్లి, ఆగస్టు 21: సముద్రంపై వేట నిషేధం ముగిసి మూడునెలలు కావస్తున్నా నేటికీ పరిహారం మంజూరు కాకపోవడంతో తీరప్రాంత మత్స్యకారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రతిఏటా ఏప్రిల్ 14నుంచి జూన్ 15వరకు మత్స్యసంపద అభివృద్ధి చెందుతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 61రోజులపాటు సముద్రంపై వేట నిషేధం అమలు చేయడం విదితమే. ఈ నిషేధకాలంలో నెలకు రూ.10వేల చొప్పున మత్స్యశాఖ నమోదు చేసిన రికార్డుల్లో పేర్లు నమోదైన బోటు యజమానులకు, బోటు ఆధారపడిన మత్స్యకారులకు ప్రభుత్వం వేట పరిహారం చెల్లిస్తోంది. ఈ పరిహారం మత్స్యకారుల బ్యాంక్ ఖాతాలకు జిల్లా మత్స్యశాఖ ద్వారా నేరుగా జమచేస్తారు. ఈ ఏడాది వేట పరిహారం చెల్లించే సమయంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వేట పరిహారం చెల్లింపు కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడింది. ఎన్నికలు పూర్తయి ఫలితాలు వచ్చాయి. కొత్త ప్రభుత్వం కొలువు తీరి రెండు నెలలు కావస్తున్నా వేట పరిహారం అందకపోవడంతో మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేట నిషేధం తర్వాత రెండు వారాలపాటు సముద్రంలో సరైన చేపలు దొరకపోవడంతో మత్స్యకారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 15రోజుల తర్వాత చేపలు సక్రమంగా దొరికే తరుణంలో వరుస అల్పపీడనాలు, వాయుగుండాలతో వేటకు వెళ్లకపోవడంతోపాటు పాటు లేకపోవడంతో జీవనోపాధి కరువై కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని మత్స్యకారులు వాపోతున్నారు. ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన వేట పరిహారం వెంటనే మంజూరు చేయాలని మత్స్యకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాకినాడ ఎస్‌డీపీవోగా విష్ణురఘువీర్



కాకినాడ క్రైం, ఆగస్టు 21: కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి(ఎస్‌డీపీవో)గా విష్ణురఘువీర్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన హనుమంతురావును పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. విష్ణురఘువీర్ 1991 ఎస్ఐ బ్యాచ్‌కు చెందినవారు. ఆయన ఎస్ఐగా కడప జిల్లాలో పనిచేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన ఆయన ఐదేళ్లపాటు సీబీఐలో కొనసాగారు. అనంతరం ఏడాదిపాటు డబ్ల్యూహెచ్ఓ పరిధిలో కోసావో విధులు నిర్వర్తించారు. తదిపరి విశాఖ రేంజ్‌లోని శ్రీకాకుళం టౌన్, విజయనగరం టౌన్, విశాఖపట్నం 5వ టౌన్, పరవాడ సీఐగా పనిచేశారు. డీఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన ఏసీబీ డీఎస్పీగా పనిచేసి బదిలీపై చిత్తూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా వెళ్లి అక్కడ విధులు నిర్వర్తిస్తుండగా ఆయన్ను కాకినాడ ఎస్‌డీపీవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

'నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేస్తే చర్యలు'

ఏలేశ్వరం, ఆగస్టు 21: ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేస్తే చర్యలు తప్పవని టౌన్ ప్లానింగ్ అధికారి ఆనంద్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆదేశాల మేరకు స్థలాలకు అనుమతులు లేకుండా లేఅవుట్లు వేయరాదన్నారు. పట్టణంలో సర్వేనెంబర్ 187, 385, 397, 409, 440, 451, 460 ల్లో అనధికార లేఅవుట్లు వేశారని, వీటిలో స్థలాలు కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్‌లు చేసు కొనుటకు ఆస్కారం ఉండదన్నారు. అనధికార లేఅవుట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బొర్రప్పాలెంలో పొలాల పరిశీలన

గండేపల్లి, ఆగస్టు 21: మండలంలోని బొర్రప్పాలెంలో పొలాలను ఏరువాక కేంద్రం పెద్దాపురం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఆర్జీ బయో 226 రకం, సిరి అనే రకం ఎక్కువగా పండిస్తున్నారని, ఈ వరిలో ఎక్కువగా బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులును మధ్యస్తంగా గమనించారు.

సారా బట్టీ ధ్వంసం

జగ్గంపేట, ఆగస్టు 21: జె.కొత్తూరు శివారు అక్రమంగా నిర్వహిస్తున్న సారా బట్టీపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధరావుకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. దాడుల్లో 20లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 600లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

'ముందస్తు టీకా వేయించాలి'

అన్నవరం, ఆగస్టు 21: రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తు టీకా వేయించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ అన్నారు. అన్నవరం దేవ స్థానం గోశాలలో పశువుల వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు ఎన్.సూర్యప్రకాష్ మాట్లాడుతూ అన్నవరం దేవస్థానం గోశాలలో ఉన్న 91 ఆవులకు ఈ టీకాలు వేశామన్నారు. దేవస్థానం డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, పీఆర్వో కృష్ణారావు, గోశాల సూపరెంటెండెంట్ ఐవీ రామారావు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు జరగాలి: యనమల

తుని రూరల్, ఆగస్టు 21: ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు మేలు జరగాలని ఆ దిశగా సమన్వయంతో కలిసి కట్టుగా పనిచేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పిలుపునిచ్చారు. తేటగుంటలోని తన కార్యాలయంలో తుని, కోటనందూరు, తొండంగి, తుని టౌన్ టీడీపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. భవిష్యత్ ప్రణాళికలు వివరించిన రామకృష్ణుడు అభివృద్ధే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. పార్టీ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగసోమరాజు(అబ్బాయి), ఇనుగంటి సత్యనారాయణ పాల్గొన్నారు.

గంబూసియా చేపల విడుదల

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 21: మంచినీటి ట్యాంకుల్లో గంబూసియా చేపలను వేయడం ద్వారా దోమల సంతతి వృద్ధి చెందకుండా నిరోధించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. కాకినాడలో ఆయన బుధవారం గంబసియా చేపలను వదిలారు. మంచినీటి శాశ్వత నీటి నిల్వల ఉన్న ప్రాంతాలను గుర్తించి సబ్ యూనిట్లుగా విభజించుకుని వీటిని విడిచిపెట్టాలని కోరారు.

'మహిళా భద్రతే ధ్యేయంగా సేవలు'

కాకినాడ క్రైం, ఆగస్టు 21: మహిళలు, బాలికల రక్షణ, భద్రతే ధ్యేయంగా పోలీసుశాఖ పనిచేస్తోందని ఉమెన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ లక్ష్మి అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ పెద్దిరెడ్డి రామచంద్రరావు ఆధ్వర్యంలో ఆనందభారతి రాజీవ్ గాంధీ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో 8 నుంచి 10వ తరగతి బాలికలకు బాలికలు, మహిళల రక్షణ, భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయన్నారు. డయల్ 100, 112, 181, 1091 టోల్ ఫ్రీ నెంబర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. రక్షణ, భద్రత చట్టాలపై అవగాహన కల్పించారు.

వైభవంగా పరదేశమ్మ జాతర

తుని రూరల్, ఆగస్టు 21: ఎస్.అన్నవరం శివారు కొత్త సూరవరం గ్రామదేవత పరదేశమ్మ జాతర కనుల పండువగా జరిగింది. భక్తులు అమ్మవారి మాలధారణ చేపట్టి విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి దర్శనార్థం పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పును నిరసిస్తూ ధర్నాలు

సామర్లకోట, ఆగస్టు 21: సామర్లకోటలో మాలల ఐక్యవేదిక పెద్దాపురం కన్వీనర్ లింగం శివప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం బంద్ ప్రశాంతంగా జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఐక్యవేదిక నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రదర్శనగా సామర్లకోట ఓవర్‌బ్రిడ్జి సెంటర్‌కు చేరుకుని మూడు రోడ్ల కూడలి వద్ద రోడ్డుపై బైఠాయించారు. సామర్లకోట రైల్వేస్టేషన్‌లోకి వెళ్లేందుకు నిరసనకారులు ప్రయత్నించగా పోలీసులు నిరోధించారు. సామర్లకోట మండలం, పట్టణ వ్యాప్తంగా మాలమహానాడు జేఏసీ నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పిఠాపురం, ఆగస్టు 21: పిఠాపురం పట్టణంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, మాలమహానాడు జాయింట్ ఏక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అన్ని దళిత సంఘాలు పట్టణంలోని వర్తక, వ్యాపార సంస్థలు, థియేటర్లు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు మూసివేయించారు. కాకినాడ-తుని మార్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. ఉప్పాడ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించి మానవహారం నిర్మించారు.

పెద్దాపురం, ఆగస్టు 21: మున్సిపల్ జంక్షన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జేఏసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, వ్యాపార సముదాయలను మూయించివేశారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టారు.

తొండంగి, ఆగస్టు 21: మండలంలో మాలమహానాడు కార్యకర్తలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను మూయించి వేశారు. బెండపూడి, ఎ.కొత్తపల్లి తదితర గ్రామాల్లో పాఠశాలలు, షాపులు మూతపడ్డాయి.

గొల్లప్రోలు, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గొల్లప్రోలులో బంద్ ప్రశాంతంగా జరిగింది. దళిత సంఘాల నేతలందరూ పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. గొల్లప్రోలు ఎంపీడీవో డీవీఎస్ శర్మ, తహసీల్దారు సత్యనారాయణలకు దళిత సంఘాల ప్రతినిధులు వినతిపత్రాలు అందజేశారు.

తాళ్లరేవు, ఆగస్టు 21: మాలమహానాడు, దళిత సంఘాల నేతలు చొల్లంగినుంచి ఇంజరం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. తాళ్లరేవు ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం 216వ జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. కాకినాడ-అమలాపురం రోడ్డు ఇరువైపులా వాహనాలు స్తంభించాయి. కోరింగ ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో చేరుకుని ఆందోళనకారుతో చర్చించి ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో దళితనాయకులు జక్కల ప్రసాద్‌బాబు, కాశిలక్ష్మణస్వామి, కమిడి ఈశ్వరీబాయి, పోతుల రత్నకుమారి, కన్నీడి మంగామణి, దడాల బుజ్జిబాబు, బోయిడి వేణుగోపాల్ పాల్గొన్నారు.

కొత్తపల్లి, ఆగస్టు 21: మండలంలో పోరాట సమితి జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. జేఏసీ నాయకులు బత్తుల రాంజీకుమార్, ఎస్ఈజెడ్ నుంచి సలాది బాబులు, వాకతిప్పకు చెందిన దాసరి శేఖర్, దాకే రాజకమార్, చీకట్ల శివ, దడాల ప్రసాద్, గెడ్డం దుర్గాప్రసాద్, బత్తిన రాంప్రసాద్, మచ్చా బాను, శీకోలు రాంజీ సక్కాల్ పాల్గొన్నారు.

తుని రూరల్, ఆగస్టు 21: తుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మాలమహానాడు కార్యకర్తలు, నేతలు విద్యాలయాలు, బ్యాంకులు, వ్యాపార సముదాయాలను మూయించారు. తేటగుంటవద్ద నిర్వహించిన ఆందోళనలో జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టే ప్రయత్నాన్ని రూరల్ సీఐ చెన్నకేశవరావు ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకుని చెదరగొట్టారు. దీంతో లింకు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకారులు నిరసన తెలిపారు. న్యాయవాది కడిమి ప్రశాంత్, ఆశాదుర్గారావు, నలమాటి కిషోర్, కడిపి లోవరాజు, సింహాచలం ఉన్నారు.

కరప, ఆగస్టు 21: కరపలో ఎస్సీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించి బజార్‌సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. ఆందోళనతో రోడ్డుకిరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్సీనాయకులు చిన్నం వెంకటేశ్వరరావు, సవిలే రాజేష్, మాతా అప్పారావు, వజ్రపు కామేశ్వరరావు, మారెళ్ల వెంకటరమణ, సాదే ఆశాజ్యోతికుమార్, సాదే వీరాఘవులు, మారెళ్ల శ్రీనివాస్, జెల్లా శివకుమార్ పాల్గొన్నారు.

ఏలేశ్వరం, ఆగస్టు 21: జైభీమ్ యువజన సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఏలేశ్వరం పట్టణ, మండలవ్యాప్తంగా బుధవారం బంద్ చేయించారు. బాలాజీచౌక్ సెంటర్‌లో మానవహారం చేపట్టి వాహనాలు రాకపోకలు నిలిపివేశారు. లింగంపర్తి, సిరిపురం, జె.అన్నవరంల్లో దళిత సంఘాల నాయకులు, సభ్యులు రోడ్డుపై మోకాళ్లపై నడిచి నిరసన తెలిపారు. గునుపూడి కొండబాబు, యోహాన్, పీతల నూకరాజు, కాకర వెంకట్రావు, నూకతాటి సతీష్, వెంకటరమణ పాల్గొన్నారు.

అన్నవరం, ఆగస్టు 21: అన్నవరంలో దళిత నాయకులు బంద్ చేపట్టారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు దడాల సతీష్, రాయి శ్రీనివాసరావు, బత్తుల రవి, మాజీసర్పంచ్ రాజాల చిట్టిబాబు వినతిపత్రం అందజేశారు. రావిచెట్టు వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. రౌతులపూడిలో ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ బంద్ చేపట్టగా ఎస్ఐ వెంకటేశ్వరరావు భద్రత కట్టుదిట్టం చేశారు.

జగ్గంపేట, ఆగస్టు 21: జగ్గంపేటలో ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ బస్టాండ్ ఎదురుగా నిరసన ప్రదర్శన చేశారు. అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. దళిత సంఘాల నేతలు పులి ప్రసాద్, జుత్తుక నాగేశ్వరరావు, సాదే నరేంద్ర బాబు, వల్లూరి సత్యానందం, నీలపల్లి అప్పారావు, జోడ చైతన్య, బోయిడి సూరిబాబు, మర్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఇరిగేషన్ కెనాల్‌పై ఆక్రమణల తొలగింపు

కరప, ఆగస్టు 21: పెనుగుదురులో ఇరిగేషన్ కాలువపై ఆక్రమణలను బుధవారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. జలవనరులశాఖ కొవ్వూరు సెక్షన్ ఏఈ నాగభవానీ సమక్షంలో కాలువపై నిర్మించిన ప్రహరీ, ర్యాంప్‌ను కూల్చివేశారు. గ్రామస్తులు, రైతులు ఈనెల 5న కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదును అనుసరించి రెవెన్యూశాఖాధికారులు మంగళవారం సర్వే చేశారని, వారి సూచనల మేరకు ఆక్రమణకు గురైన 56గజాల ఇరిగేషన్ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామని ఏఈ నాగభవానీ తెలిపారు.

'ఆక్రమణలన్నింటినీ తొలగించాలి'

పెనుగుదురులో ఇరిగేషన్ కాలువపై ఉన్న ఆక్రమణలన్నింటినీ తొలగించాలని మాజీ సర్పంచ్ రెడ్డిపల్లి నారాయణరావు డిమాండ్ చేశారు. పెనుగుదురులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదన్నారు. ఇరిగేషన్ స్థలాన్ని కలిపేసుకున్నట్టు వచ్చిన ఫిర్యాదుపై తానే స్వయంగా ముందుకు వచ్చి సర్వే చేయమని అధికారులను ఆశ్రయించానన్నారు.

డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీ

కరప, ఆగస్టు 21: కరప మండలం కొరుపల్లిలో బుధవారం వ్యవసాయాధికారులు డ్రోన్ సహాయంతో పురుగుమందుల పిచికారీని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ విధానంతో తక్కువ ఖర్చుతో పిచికారీని పూర్తిచేయవచ్చని ఏవో ఏపీ రాజేష్ తెలిపారు. సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు, వీపీఏలు స్వర్ణతేజ, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన అప్పలరాజు



జగ్గంపేట, ఆగస్టు 21: అమరావతిలో సీఎం చంద్రబాబును జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట అన్న వరం రిటైర్డ్ పీఆర్వో తులా రాము ఉన్నారు.

పోస్టాఫీసు పథకాలపై అవగాహన

కాకినాడ సిటీ, ఆగస్టు 21: ప్రజలు పోస్టాఫీసు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ చుక్క శ్రీనివాసరావు కోరారు. కాకినాడ హెడ్ పోస్టాఫీసు ఆవరణలో డాక్ చౌపాల్(పోస్ట్ ఆఫీసు పథకాలపై అవగాహన) కార్యక్రమం బుధవారం నిర్వహించారు. దీనికి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. విశిష్టఅతిథిగా ఆంధ్రప్రదేశ్ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.శివ నాగరాజు విచ్చేశారు. కాకినాడ ప్రధాన తపాలా కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్లు గంటి రామకృష్ణ, అవసరాల శ్రీనివాసరావు, డి.అనిల్ అంబేడ్కర్‌కుమార్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు సూర్యప్రకాశరావు, లెక్కల నాయుడు, ఐపీపీబీ సీనియర్ మేనేజర్ రాజ్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

'పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతంపై హర్షం'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 21: నిస్సహాయ స్థితిలో ఉన్న పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తామని, ఆర్థిక వనరులు కల్పిస్తామని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రకటించడం హర్షణీయమని రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాదరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 15వఆర్థిక సంఘం నిధులు రూ.998కోట్లు విడుదల అభినందనీయమన్నారు.

మండల వీవోఏల సంఘం ఎన్నిక

సర్పవరం జంక్షన్, ఆగస్టు 21: కాకినాడ రూరల్ మండల సమాఖ్య వీవోఏల సంఘం అధ్యక్షురాలిగా కందా గంగాభవానీని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. బుధవారం రమణయ్యపేట మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగిన వీవోఏ(యానిమేటర్లు) సర్వసభ్యుల సమావేశంలో పాలకవర్గ సభ్యులను సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా గంగాభవానీ, ఉపాధ్యక్షురాలిగా కొరలబండి నీలవేణి, సెక్రటరీగా పరిమి రత్నమాల, జాయింట్ సెక్రటరీగా బడే అనంతలక్ష్మి, కోశాధికారిగా సవరపు పద్మావతి, పాలకవర్గ సభ్యులుగా అరుణ, తులసి, వెంకటలక్ష్మి, నాగమణి, శ్రీదేవి, నాగలక్ష్మి, సూర్యలక్ష్మి, లోవకుమారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రాధాన్యాలను గుర్తించి విధులు నిర్వహిస్తూ, వీవోఏలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అధ్యక్షురాలు గంగాభవాని తెలిపారు.

విపత్తుల సమయంలో అప్రమత్తత అవసరం

ఉప్పలంక(కరప), ఆగస్టు 21: అనుకోని ప్రమాదాలు, విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉంటే ప్రాణాలను కాపాడుకోవడంతోపాటు పక్కవారికి రక్షణ ఇవ్వగలుగుతామని ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ యాదవ్ అన్నారు. కరప మండలం ఉప్పలంకలో కలెక్టర్, 10వ బెటాలియన్, జాతీయ విపత్తుల ప్రతిస్పందన దళం విజయవాడ, డిప్యూటీ కమాండెంట్ దిల్‌బాగ్ సింగ్ ఆదేశాలతో ప్రజలకు, విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భూకంపాలు, వరదలు లాంటి విపత్తులవేళ వాటినుంచి ఎలా బయటపడాలి అనేది ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రమాదాలు జరిగినప్పుడు చేపట్టాల్సిన ప్రాథమిక చికిత్స, గుండెపోటు బాధితులకు సీపీఆర్ చేయడంపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. ఆర్ఐ పేపకాయల మాచరరావు, ఏఎస్ఎఫ్‌వో పి.కృష్ణదొర, కార్యదర్శి దుర్గాభవానీ, వీఆర్వో వెంకటేశ్వరావు, ఎన్‌డీఆర్ఎఫ్ టీమ్ సభ్యులు సందీప్ పాల్గొన్నారు.

కరపలో అనాథాశ్రమాల తనిఖీ

కరప, ఆగస్టు 21: కలెక్టర్ ఆదేశాల మేరకు కరప మండలంలోని నాలుగు అనాథాశ్రమాలను తనిఖీ చేసినట్టుగా జిల్లా ఉపాధి కల్పనాధికారి, మండల ప్రత్యేకాధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని నడకుదురు, పెనుగుదురు, కరప, గొడ్డటిపాలెంల్లోని అనాథాశ్రమాలను బుధవారం ఎంపీడీవో కొంకి అప్పారావుతో కలిసి తనిఖీచేశారు. గొడ్డటిపాలెం జీవనజ్యోతి అనాధ శరణాలయం నిబంధనలకు విరుద్ధంగా ఉందని, ఓల్డ్ ఏజ్ హోమ్ రిజిస్ట్రేషన్ చేయించుకుని అనాధ పిల్లలను చేర్పించుకున్నారని తెలిపారు. శరణాలయంలో కనీస వసతులు లేవని, అబ్బాయిలు, అమ్మాయిలు కలిసి ఉంటున్నారని చెప్పారు. అనకాపల్లి దుర్ఘటన నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టామని, బయట ఫుడ్‌ను అనుమతించరాదని, నిబంధనలను పాటించాలని సూచించామన్నారు. కార్యదర్శులు రామ్‌జీ, బ్రహ్మానందరావు, సునీల్, చంద్రకళ పాల్గొన్నారు.

తాళ్లరేవులో వసతిగృహాల పరిశీలన

తాళ్లరేవు, ఆగస్టు 21: కోరంగి పంచాయతీ పరిధి ఉమామనోవికాస కేంద్రం టెక్నికల్ ఎడ్యుకేషనల్ సొసైటీ, శ్రీదుర్గామల్లేశ్వరి అనాథ బాలలు, వృద్ధాశ్రమాలను జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ విజయశాంతి బుధవారం పరిశీలించారు. కేంద్రంలో ఫిజియోథెరపీ, బాత్‌రూమ్‌లు, తాగునీరు సౌకర్యాలను పరిశీలించారు. దివ్యాంగులు, సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. తహసీల్దార్ ఎం.సూరిబాబు, సెంటర్ ఇన్‌చార్జి ఎంజె. గోపాలరావు, వీఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాగునీరందించండి మహాప్రభో!



వలసపాకలలో బీటలు వారిన పొలాన్ని చూపిస్తున్న రైతులు

కరప, ఆగస్టు 21: గతనెలలో కురిసిన వర్షాలకు ఆకుమడులు ముంపునకు గురయ్యాయి.. అనేక వ్యయప్రయాసలకోర్చి మళ్లీ వరినాట్లు వేసుకున్నాం.. ఇప్పుడు సాగునీరందక పొలాలు బీటలువారిపోతున్నాయంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే సాగునీరందించాలని లేకపోతే తీవ్రంగా నష్టపోతామని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కూరాడ, వాకాడ, వేములవాడ, వలసపాకల, కరప గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల ఆయకట్టుకు సంపరబోది పంటకాలువ ద్వారా సాగునీరందుతోంది. రెండు వారాలుగా సాగునీరు పారక పంటపొలాలు నెరలుదీశాయి. పొలాలకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అసత్య ప్రచారాలను కట్టడి చేయాలని ఎస్పీకి వినతి

కాకినాడ క్రైం, ఆగస్టు 21: సోషల్ మీడియాలో ముస్లిం మత ఆచారాలను కించపరుస్తూ విద్వేషాలను రెచ్చగొట్టేలా వైరల్ అవుతున్న వీడియోలను, అసత్య ప్రచారాలను కట్టడి చేయాలని కోరుతూ ముస్లిం ప్రజా సంఘాలు ప్రతినిధులు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ముస్లిం వేదిక కన్వీనర్ హసన్ షరీఫ్, అధికారి ప్రతినిధి బ్రదర్ అహ్మద్, మాజీ వక్ఫ్‌బోర్డు సభ్యులు అబ్దుల్ బషీరుద్దీన్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో ముస్లిం మతంపై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. కాకినాడలో హిందూ, ముస్లింల ఐక్యత చాలా బాగుందని, అందరం సోదరభావంతో కలసిమెలసి ఉంటున్నామన్నారు. ఈ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పాడుచేసేలా కొంతమంది సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలను వ్యాప్తి చేస్తున్నారన్నారు. జిల్లాలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా చేస్తున్న వారిని ఉపేక్షించేదిలేదని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీఇచ్చారు. ఎంపీజే జిల్లా అధ్యక్షులు హలీమ్ మాస్టర్, ఆప్ నాయకులు రియాజ్, ఖాజా, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అందుబాటులోకి అత్యాధునిక పరికరం

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 21: కాకినాడ జీజీహెచ్ న్యూరోసర్జరీ విభాగానికి అత్యాధునిక పరికరం అందుబాటులోకి వచ్చింది. నియర్ ఇన్‌ఫ్రా రెడ్ స్కానర్(ఎన్ఐఆర్ఎస్) అనే ఈ పరికరాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ విజయశేఖర్ మాట్లాడుతూ తలకి గాయమై తలలో రక్తం గెడ్డ కట్టినప్పుడు ఈ పరికరంతో సులభతరమైన పద్ధతిలో గుర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, డాక్టర్ దేవీమాధవి, ఎన్‌టీఆర్ హెల్త్‌వర్సిటీ విశ్రాంత వీసీ డాక్టర్ కె.బాబ్జి, న్యూరోసర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ కోదండగిరి, డాక్టర్ శేషగిరిరావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు శ్రావణ శుక్రవారం పూజలకు ఏర్పాట్లు పూర్తి

సామర్లకోట, ఆగస్టు 21: శ్రావణమాసం మూడో శుక్రవారం మహాపర్వదినం సందర్భంగా మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతపూజలు నిర్వహించేందుకు సామర్లకోట భీమేశ్వరాలయంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో బళ్ల నీలకంఠం తెలిపారు. వ్రతపూజల్లో పాల్గొనేవారు ముందుగా తమ గోత్రనామాలతో ఆలయ కార్యాలయం వద్ద నమోదు చేసుకోవాలన్నారు.

వైద్యురాలి మృతికి నివాళిగా కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తులు వెలిగించి నిరసన ర్యాలీ చేస్తున్న దృశ్యం

సామర్లకోట, ఆగస్టు 21: కోల్‌కత్తాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటన నేపథ్యంలో ఆమె మృతికి నివాళిగా సామర్లకోట యువత, భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం, తదితర మహిళా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పెద్దాపురం రోడ్డు మెహెర్ కాంప్లెక్స్‌నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో కాకినాడ జీజీహెచ్ వైద్యురాలు డాక్టర్ పార్వతి మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ కొరవడుతోందన్నారు. కుటుంబ పోషణకోసం ఉద్యోగాలు చేస్తున్న మహిళలకు భద్రత లేదన్నారు. స్టేషన్ సెంటర్ వరకూ ఈ నిరసన ర్యాలీ కొనసాగించారు. కార్యక్రమంలో సీహెచ్.మహేష్, హరి, డాక్టర్ మహోన్నత్, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ శంకర్, డాక్టర్ దివ్య, సురేఖ, ప్రసాదరావు, శ్రీనువాస్, వరలక్ష్మి, సరోజా వాసు, మడగల శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతగా ఫీవర్ సర్వే: డిప్యూటీ డీఎంహెచ్‌వో

పెద్దాపురం, ఆగస్టు 21: ఫీవర్ సర్వేను సమర్థవంతగా చేపడుతున్నట్టు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.సరిత పేర్కొన్నారు. స్థానిక సీహెచ్‌సీని బుధవారం ఆమె పరిశీలించారు. వార్డుల్లో జ్వరపీడితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ అనూషారాయ్ పాల్గొన్నారు.

'మాతృత్వం సేవలు అభినందనీయం'

మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీమ్ ఆధ్వర్యంలో ప్రతివారం ప్రభుత్వ ఆస్పత్రిలో మాతృత్వం పేరుతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందచేయడంపై డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సరిత టీమ్ సభ్యులను బుధవారం అభినందించారు. 23 వారాల నుంచి ఈ కార్యక్రమం నిరాటంకంగా సాగడంపై ఆమె మెచ్చుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనూషారాయ్, వైద్యసిబ్బంది రమాదేవి, భవానీ, మన పెద్దాపురం గ్రూప్ సభ్యులు నవీన్ నానీ, రాజేష్, దేవత రాజేష్‌కుమార్, రాఘవ, జయశ్రీ, లక్ష్మీ, రత్నం, పెదిరెడ్డి నరేష్ పాల్గొన్నారు.

ఓటర్ల నవీకృత జాబితా రూపకల్పనకు చర్యలు చేపట్టాలి: ఆర్డీవో

పెద్దాపురం, ఆగస్టు 21: ఓటర్ల నవీకృత జాబితా రూపకల్పనకు చర్యలు చేపట్టాలని ఆర్డీవో జె.సీతారామారావు ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ నిమిత్తం డివిజన్ పరిధిలోని ఎంపీడీవో, ఎంఈవోలతో నిర్వహించిన సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. నూతన ఉపాధ్యాయ ఓటర్ల జాబితా రూపకల్పనకు సమన్వయంతో పనిచేయాలన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు అందరికీ ఓటునమోదుకు అవకాశం కల్పించాలన్నారు. అందిన ప్రతి క్లయిము, అభ్యంతరాన్ని ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఆర్డీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'పొలంబడి'లో రైతులకు అవగాహన

పిఠాపురం రూరల్, ఆగస్టు 21: వరిపొలాల్లో సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని మండల వ్యవసాయాధికారి అచ్యుతరావు సూచించారు. పిఠాపురం మండలం విరవలో బుధవారం పొలంబడి నిర్వహించారు. వరి పొలాలను పరిశీలించి సస్యరక్షణ చర్యల గురించి రైతులకు సూచనలిచ్చారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంపై గోడపత్రికలను ఆవిష్కరించారు. వీఏఏలు, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం, ఆగస్టు 21: మండలంలోని సిరిపురంలో వ్యవసాయ అధికారిణి జ్యోతి ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. బుధవారం రైతులకు పొలంబడి శిక్షణలో ఆమె మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

గండేపల్లి, ఆగస్టు 21: మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ లాభదాయక పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ఈ-పంట నమోదు సెప్టెంబర్ 10 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. జగ్గంపేట హబ్ ఏవో కరుణాకరరాజు, జిల్లా వనరుల కేంద్రం ఏవో సంజీవ్‌కుమార్, ఏవో సద్గురుమూర్తి ఉన్నారు.

తుని రూరల్, ఆగస్టు 21: పత్తి రైతులు యాజమాన్య పద్ధతి అవలంబిస్తే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. మండలంలో వ్యవసాయశాఖ అధికారులతో కలిసి చేపూరులో పత్తిపంటను పరిశీలించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఏఎస్ ఆర్ శర్మ, డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ రోజా, డాక్టర్ సునీత, వ్యవసాయాధికారి అశోక్‌కుమార్ ఉన్నారు.

ప్రత్తిపాడు, ఆగస్టు 21: మండలంలోని ఒమ్మంగి, ఉత్తరకంచి, శరభవరంల్లో వరి పంట పొలాలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. నెలరోజులపాటు ఏపుగా పెరిగిన వరి చేనును శాస్త్రవేత్తల బృంద సభ్యులు పరిశీలించి పలు సూచనలు చేశారు.